ఆటుపోట్లపై బతుకు నావ!

- పారిశ్రామిక కాలుష్యంతో తగ్గిపోతున్న మత్స్యసంపద
- జీవనోపాధికి పోటెత్తే కెరటాలకు ఎదురీత
- నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం



గోదావరిలో సంప్రదాయ వేటలో నిమగ్నమైన మత్స్యకారులు



వలతో చేపలవేట చేస్తున్న మత్స్యకారుడు

యానాం/కాట్రేనికోన: వారి జీవితాలు నిత్యం ఆటుపోట్ల నడుమ పోటెత్తే కెరటాలతో పోటీ పడతాయి. జీవిత ప్రయాణంలో ఎన్నో తుపానులు, అలజడులు ఎదురయినా మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నాయి. అయితే పారిశ్రామిక కాలుష్యం, పెట్రోలియం కంపెనీల కార్యకలాపాల రూపంలో వీరి జీవనోపాధికి విఘాతం కలుగుతోంది. క్రమంగా మత్స్యసంపద తగ్గిపోతుండటంతో ఎటువెళ్లాలో తెలియక దిక్కూదిలేని నావ ప్రయాణంలా మత్స్యకారుల జీవితాలు సాగుతున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులు ప్రతి ఏటా నవంబర్ 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని నిర్వహించుకుంటారు. 2015 నుంచి ఏటా జరుపుకునే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం పర్యావరణానికి హాని కలగని రీతిలో ఆరోగ్యకరమైన పద్ధతుల్లో మత్స్య ఉత్పత్తులను పట్టుకోవడం, వాటి సంరక్షణకు ప్రాధాన్యత నివ్వడం లక్ష్యంగా మత్స్యకార దినోత్సవాన్ని జరుపుతారు. దీనికి ముందు 1997లో వరల్డ్ ఫిషరీష్ ఫోరం దీనిపై 18 దేశాలతో సమావేశం జరిపి నిర్ణయం తీసుకుంది.

వేలాదిమందికి జీవనోపాధి

లక్షలాది కుటుంబాలు మత్స్యవేటను నమ్ముకొని జీవిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి అధ్యయనం ప్రకారం ప్రపంచంలో చేపలవేటలో మూడింట రెండొవంతు జనాభాకు ప్రస్తుతం జీవనోపాధి లేకుండా పోయిందని వెల్లడైంది. అంతేకాకుండా జాలర్లు తమ సాంప్రదాయ వృత్తినుంచి దూరమవుతున్నారని తెలిపింది. యాంత్రీకరణ, ఓవర్‌ఫిషింగ్, పారిశ్రామిక కాలుష్యాలు, రసాయనిక వ్యర్థాలు సముద్ర, నదీ జలాల్లోనికి వదిలేస్తున్నారని ఇది కాస్తా మత్స్య సంపదను హరిస్తుందని పేర్కొంది. యానాం నియోజకవర్గంతో పాటు ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని తాళ్లరేవు, కాట్రేనికోన, ఐ పోలవరం, ముమ్మిడివరం ప్రాంతాల్లో వేలాది కుటుంబాలు మత్స్యవేటనే నమ్ముకుని జీవనోపాధి సాగిస్తున్నాయి.

దెబ్బతీస్తున్న చమురు వెలికితీత

కేజీబేసిన్‌లో ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు కనుగొనడంతో గోదావరి, బంగాళాఖాతం కలిసే సీమౌత్ ప్రాంతాల రూపురేఖలు మారిపోయాయి. కృష్ణా, గోదావరి బేసిన్‌లో లక్షలాది క్యూబిక్ మీటర్ల గ్యాస్, పెట్రోలియం నిక్షేపాలను కనుగొనడంతో వాటిని వెలికి తీసేందుకు రిలయన్స్, జీఎస్‌పీసీ, ఓఎన్‌జీసీ, కెయిన్ ఎనర్జీ, ఇండియన్ ఆయిల్ తదితర సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా బంగాళాఖాతంతో రిగ్‌లు వేయడంతో అక్కడ నుంచి చమురును వెలికితీసి సముద్రంలో వేసిన ప్రత్యేక గొట్టాల ద్వారా తీరంలో ఏర్పాటు చేసుకున్న ఆఫ్‌షోర్ టెర్మినల్స్‌కు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో చమురు తెట్టు తదితర వాటి వల్ల మత్స్యసంపదకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని మత్స్యకారులు ఎప్పటినుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పులస చేపలు సైతం చిక్కని పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ ఇవేమి పట్టనట్లు చమురు సంస్థలు వ్యవహరిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయం



తీర ప్రాంత మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా పుదుచ్చేరి ప్రభుత్వం కృషి చేస్తోంది. వేట విరామ సమయంలో నష్ట పరిహారం పంపిణీతో పాటు వేటలో ప్రమాదవశాత్తూ మృతిచెందిన వారికి పరిహారం ఇస్తున్నారు. ఓఎన్‌జీసీ నష్ట పరిహారం పంపిణీకి అన్ని విధాలా చర్యలు తీసుకున్నాం.

– గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం

రాయితీపై బోట్లు, వలలు మంజూరు చేయాలి

మత్స్యకారులకు ప్రభుత్వం రాయితీపై బోట్లు, వలలు మంజూరు చే యాలి. ప్రస్తుతం బోట్లు, నావలు కొను గోళ్లకు లక్షలాది రూపాయలు ఖర్చవుతోంది. మత్స్యకార కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందించాలి.

– మోడె హరిశ్చంద్ర, సావిత్రినగర్.

నిషేధిత సమయాన్ని పాటించాలి



చేపలవేట నిషేధిత సమయాన్ని మత్స్యకారులు కచ్చితంగా పాటించాలి. చేపల ప్రత్యుత్పత్తి సమయంలో వేటకు వెళ్లడం మానుకోవాలి. సముద్ర జలాల్లో జల చరాలు సంతానోత్పత్తి జరిగే సమయం ఇదే. సముద్ర భూభాగంలోని వ్యర్థాలను ఆహారంగా తీసుకొంటూ సమతుల్యతను కాపాడే సముద్రపు తాబేళ్లు ఈ కాలంలోనే వేలాది కిలోమీటర్లు ప్రయాణించి గుడ్లు పెట్టేందుకు వస్తాయి.

– డా.రామమోహనరావు, విశ్రాంత మత్స్యశాఖ డీడీ, కాకినాడ

సమస్యలు పరిష్కరించాలని వినతి



హోంమంత్రి నమశ్శివాయంతో ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పుదుచ్చేరి హోంమంత్రి నమశ్శివాయంను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. బుధవారం పుదుచ్చేరిలో ఆయన కార్యాలయంలో కలిశారు. గతంలో సేవలు అందించిన పారాటీచర్ల నియామకాలు చేయాలని కోరారు. ఇప్పటికే విద్యాసంవత్సరంలో కొన్ని నెలలు పూర్తయ్యాయని మిగిలిన కొద్ది నెలలతో పాటు వచ్చే విద్యా సంవత్సరానికి సైతం వారిని కొనసాగించాలని కోరారు. వివిధ పాఠశాలల్లో పాలు కాచి విద్యార్థులకు పంపిణీ చేసే మిల్క్ బాయిలర్స్‌కు రూ.18వేలు పెంచుతున్నట్లు ప్రకటించినా ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయాలేదన్నారు. అభివృద్ధి పనులకు జరుగుతున్న ఆటంకాలపై వివరించారు.

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె కై లాష్‌నాథన్‌ను రాజ్‌నివాస్‌లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కలిశారు. ఎమ్మెల్యే ల్యాడ్ నిధుల నుంచి పలు పనులకు టెండర్లు పిలిచారని కాని కొంతమంది కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారని వారి లైసెన్స్ రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎల్జీని కోరారు. పలు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

కొబ్బరి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ వసంతకుమార్



దరియాలతిప్పలో వరి పొలాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ వసంతకుమార్, అధికారులు

యానాం: కొబ్బరి రైతాంగం సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని పుదుచ్చేరి వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ వసంతకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆత్మ పథకంలో భాగంగా 'కిసాన్ గోష్టి–సమగ్ర సస్యరక్షణ' అనే అంశంపై కొబ్బరి రైతాంగానికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఆర్ఏఓ మునిస్వామి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. అనంతరం కొబ్బరి రైతులకు ఫిరమోన్ ట్రాప్‌లను పంపిణీ చేశారు. అనంతరం కనకాలపేట రైతులతో మాట్లాడారు. దరియాలతిప్ప రైతు నాయకుడు సబ్బతి లోకేశ్వరరావు, రైతాంగ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేట ఉద్యావన పరిశోధనా స్థానం నుంచి శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్‌బి చలపతిరావు, డాక్టర్ నీరజ, వ్యవసాయశాఖ ఏడీ శివ సుబ్రహ్మణియన్, వ్యవసాయాధికారి జోగిరాజు, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పంట దిగుబడి పెంచేందుకే పొలంబడి



చొల్లంగి పొలంబడి కార్యక్రమంలో రైతులను సత్కరిస్తున్న అధికారులు

తాళ్లరేవు: వరిసాగులో పెట్టుబడి తగ్గించి దిగుబడి పెంచేందుకే పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారిణి ఎస్.ప్రశాంతి తెలిపారు. మండల పరిధిలోని చొల్లంగిలో ఇండ్‌గ్యాప్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా క్షేత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ నుంచి ఇండి పొలంబడిలో భాగంగా రైతులు పంట పండించే సమయంలో అవసరం మేరకు పురుగుమందులు, ఎరువులు వాడి పంట నాణ్యతను పెంచుకోవాలని సూచించారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం రైతు ఉత్పాదక కేంద్రాల ద్వారా మద్దతు ధరకు మించి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అధిక దిగుబడులు సాధించిన రైతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీఏఏ వెంకటరమణ, గర్రే లక్ష్మీనారాయణ, కట్టిమేను నూకరాజు, ఈతమూడి రాఘవ, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్లు ధ్వంసం

అంబేడ్కర్‌నగర్ వాసుల నిరసన



తాగునీటి పైపులైను పగలడంతో జలమయంగా మారిన రహదారి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ఇంటింటికి గ్యాస్ పైపులైన్లు వేస్తున్న నేపథ్యంలో భూగర్భంలోని పలు తాగునీటి పైపులైన్లు ధ్వంసమవుతున్నాయని దీంతో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతాల నివాసితులు నిరసన వ్యక్తం చేశారు. గత కొద్దిరోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా పెద్ద యంత్రాలతో భూమి లోపలకు గ్యాస్ పైపులైన్లు వేస్తుండటంతో తాగునీటి పైపులు పగిలి దానిలో మురుగు నీరు కుళాయిల్లోకి ప్రవేశించటం ద్వారా దుర్వాసనతో కూడిన మట్టినీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌నగర్, సీతమ్మపేట, రామన్నకోడు, మెట్టకూరు రమాభాయ్‌నగర్ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక యువకులు సంబంధిత గ్యాస్ పంపిణీ సంస్థ ప్రతినిధులను నిలదీశారు. సంబంధిత పీడబ్ల్యూడీ అధికారులు సైతం చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పునరుద్ధరణ పనులు చేస్తామని అధికారులు వారికి హామీ ఇచ్చారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని పాత బండారులంక భువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో పవిత్ర కార్తికమాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం పార్వతీ పరమేశ్వరుల దివ్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చంద్రకళ దంపతులు కర్తలుగా వ్యవహరించారు. శ్రీశైలం మహాక్షేత్రం నుంచి తీసుకొని వచ్చిన లడ్డూలను ప్రసాదంగా పంపిణీ చేశారు. అయ్యప్పలకు, భవానీలకు వడి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కుండలేశ్వరుడు



భక్తులకు దర్శనమిస్తున్న కుండలేశ్వరుడు

కాట్రేనికోన: మండల పరిధిలోని కుండలేశ్వరంలో వేంచేసి యున్న పార్వతీ సమేత కుండలేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు గౌతమీ గోదావరి నదిలో స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు రావి చెట్టు చుట్టూ ప్రదర్శనలు చేసి దీపారాధన చేశారు. అనంతరం పార్వతీ సమేత కుండలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామికి రకరకాల పుష్పాలు, బిల్వ దళాలతో అలంకరించారు. దాతల ఆర్థిక సహాయంతో ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

గ్రంథాలయాల వినియోగంతో జ్ఞానాభివృద్ధి



ఉప్పలగుప్తంలో విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న తహసీల్దార్ దివాకర్



సవరప్పాలెంలో విద్యార్థులకు బహుమతుల అందజేత

ఉప్పలగుప్తం: విద్యార్థులు గ్రంథాలయాలలో పుస్తక పఠనం చేయటం ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవాలని తహసీల్దార్ వీఎస్.దివాకర్ అన్నారు. మండలంలోని భీమనపల్లి, ఉప్పలగుప్తం గ్రంథాలయ శాఖల్లో జరిగిన ముగింపు వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వారోత్సవాల్లో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్తి సత్యకృష్ణ, గ్రంథాలయాధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషుకుమార్, ఆర్ఐ లలిత, నల్లా నరసింహమూర్తి, చిక్కం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

అమలాపురం రూరల్: సవరప్పాలెం గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయం వద్ద ముగింపు సభ బుధవారం జరిగింది. శ్రీ రామ పబ్లిక్ స్కూల్, వన్నె చింతలపూడి ఉన్నత పాఠశాల, సమనస గురుకుల పాఠశాల విద్యార్థులకు పంచాయతీ కార్యదర్శి పి సూరిబాబు, విశ్రాంత ఏఆర్ఓ సత్తి రంగయ్య, శ్రీరామ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ పి.లక్ష్మీ గణేష్, గ్రంథాలయ అధికారి ఎస్‌వీ.నాగేశ్వరరావులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సత్తి రాంబాబు, నందేపు శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



ప్రత్యేక అలంకరణలో వీరేశ్వరస్వామి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో పార్వతీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వెలువలపల్లి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, శాంతి హోమం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి అన్న సమారాధన కార్యక్రమాన్ని జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేటినుంచి ప్రాంతీయ సైన్స్ ఎగ్జిబిషన్

యానాం: పుదుచ్చేరి విద్యాశాఖ ఆధ్వర్యంలో యానాం రీజియన్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను ఈనెల 21, 22, 23 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు బుధవారం ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పీఎం శ్రీ రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో జరిగే ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కళాశాలల విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించనున్నారన్నారని తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తదితరులు హాజరు కానున్నారని చెప్పారు.

ఇద్దరు పాత నేరస్తులబైండోవర్

అమలాపురం టౌన్: అయినవిల్లి మండలంలో మద్యం కేసులకు సంబంధించి ఇద్దరు పాత నేరస్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు అమలాపురం ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ ఇద్దరు నిందితులను అయినవిల్లి ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, తహసీల్దార్ ఎదుట బుధవారం హాజరు పరచగా వారికి చెరో రూ.లక్ష చొప్పున ష్యూరిటీ విధించినట్లు పేర్కొన్నారు.

మద్యం సేవించి పట్టుబడ్డ వాహనదారులకు జైలు

తాళ్లరేవు: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 8 మందికి జైలుశిక్ష, 9మందికి జరిమానా విధించినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. జాతీయ రహదారిలోని పోలేకుర్రు వై.జంక్షన్ చెక్ పోస్టు వద్ద బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 17 మందిలో 9 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.90 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. జరిమానా చెల్లించని ఎనిమిది మందికి జైలుశిక్ష విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మరో 8 మందికి ఒక్కొక్కరికి రూ.300 చొప్పున రూ.2400 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

అల్లవరం: కొమరగిరిపట్నం మద్యం షాపు నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఎస్.రామేశ్వరం గ్రామానికి చెందిన అంగాని నారాయణస్వామిని అల్లవరం పోలీసులు బుధవారం కాపుకాసి పట్టుకున్నారు. మద్యంషాపు నుంచి 23 మద్యం సీసాలు కొనుగోలు చేసి మోటారుసైకిల్‌పై తరలిస్తుండగా ఎస్.రామేశ్వరం బ్రిడ్జి వద్ద పట్టుకున్నారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై ఎస్సై హరీష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు.

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు



దేవస్థానంలో హుండీలను తెరచి లెక్కిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. గత మూడు నెలలకు సంబంధించిన హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ.17.47 లక్షల ఆదాయం వచ్చిందని దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. దేవాదాయ శాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగింది. హుండీల లెక్కింపులో దేవస్థానం సిబ్బంది, అర్చకులు, వివిధ ధార్మిక సంఘాల సభ్యులైన భక్తులు పాల్గొన్నారు.

23న ఉప్పలగుప్తంలో న్యాయసదస్సు

అమలాపురం టౌన్: ఈనెల 23న ఉప్పలగుప్తం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 'విధాన్ సే సమాధాన్' పేరిట మహిళలకు న్యాయ సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ తెలిపారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని న్యాయమూర్తి సూచించారు. ప్రతి మహిళ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ఆ లక్ష్యంతోనే ప్రత్యేకించి మహిళలకు న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

స్వనిధిపై వ్యాపారులకు అవగాహన



పీఎం స్వనిధి రుణాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై స్థానిక డీసీసీబీ బ్రాంచిలో వీధి వ్యాపారులు, డ్వాక్రా మహిళలకు ఆ బ్యాంక్ అధికారులు బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో డీసీసీబీ బ్రాంచి మేనేజర్ కేఎస్‌వీఎస్ఎన్ మూర్తి పలు పథకాలపై వీరికి అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు పాల్గొని పీఎం స్వనిధి రుణాలు పొందే విధానాన్ని వివరించారు. ఈనెల 18 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకూ అన్ని వాణిజ్య బ్యాంకుల్లోను వీధి వ్యాపారులకు స్వనిధి డిజిటల్ యాక్టివేషన్‌పై శిక్షణ ఇస్తారని చెప్పారు. మెప్మా ఐబీ మేనేజర్ కుమార్, శ్రీనివాస్, డిజిటల్ అగ్రిగేటర్స్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంరక్షణపై అవగాహన



పాఠశాల ఆవరణలో మొక్క నాటిన ఎస్సై హరీష్‌కుమార్

అల్లవరం: గోడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళా సంరక్షణపై బాలికలకు ఎస్సై హరీష్‌కుమార్ అవగాహన కల్పించారు. మహిళలు, బాలికల రక్షణ కొరకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. పని చేసే ప్రదేశంలో అధికారుల వేధింపులు, అపరిచిత వ్యక్తుల నుంచి ప్రమాదం ఉందని గ్రహిస్తే జాగ్రత్త పడాలని సూచించారు. స్థానికంగా ఉన్న పోలీస్‌స్టేషన్‌ని సంప్రదించి రక్షణ పొందవచ్చని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఎస్సై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు ఎనలేనివి

తాళ్లరేవు: ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, పి.మల్లవరం గ్రామ సర్పంచ్ దున్నా సత్యనారాయణ సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సత్యనారాయణ సంస్మరణ సభ నిర్వహించారు. పార్టీ నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు, మందాల గంగ సూర్యనారాయణ, నడింపల్లి వినోద్, కట్టా త్రిమూర్తులు, మోర్త భైరవమూర్తి తదితరులు సభలో మాట్లాడారు.

వైఎస్ జగన్‌తో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ భేటీ



మాజీ సీఎం జగన్‌తో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ విషయాన్ని విజయవాడ నుంచి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అమలాపురం మీడియాకు తెలిపారు.

కాపు వర్గీయులు ఐక్యంగా మెలగాలి



వనసమారాధన భోజనాలు చేస్తున్న కాపు వర్గీయులు

అమలాపురం టౌన్: కాపు వర్గీయులు ఐక్యంగా మెలుగుతూ రాజకీయ, వాణిజ్య, వ్యవసాయ, సేవా రంగాల్లో అభివృద్ధి చెందే దిశగా అడుగులు వేయాలని కోనసీమ కాపు నాయకులు ఉద్ఘాటించారు. తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కోనసీమ కాపు నాయకులు, ఆ సామాజిక వర్గీయులు అమలాపురంలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కోనసీమ కాపు నాయకులు మెట్ల రమణబాబు, బోనం కనకయ్య, అల్లాడ స్వామినాయుడు, నల్లా విష్ణుమూర్తి, కల్వకొలను తాతాజీ, చిక్కాల గణేష్, నల్లా శివాజీ, గంధం పల్లంరాజు తదితరులు కార్తిక వనసమారాధన వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకలకు కోనసీమ నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి కాపు నాయకులు తరలివచ్చి ఆత్మీయ వాతావరణంలో సహపంక్తి భోజనాలు చేశారు. కాపు నాయకులు నల్లా స్వామి, బండి గుప్తాపు రంగా, ఎమ్మెల్సీ ప్రసాద్, నల్లా వపన్, ఆకుల రామకృష్ణ, బొర్రా ఈశ్వరరావు, తిక్కిరెడ్డి నేతాజీ, నల్లా చిట్టి, యేడిద శ్రీను తదితరులు తమ సామాజిక వర్గీయులకు వారే స్వయంగా భోజనాలు వడ్డించారు.

మెప్మా బజార్‌ను ప్రోత్సహించాలి

మున్సిపల్ కమిషనర్ రాజు



మహిళలు తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేస్తున్న కమిషనర్ రాజు

అమలాపురం టౌన్: స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసిన వస్తువుల విక్రయానికి ఉంచిన మెప్మా బజార్‌ను అంతా ప్రోత్సహించాలని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు అన్నారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో బుధవారం ఏర్పాటైన మెప్మా బజార్‌ను కమిషనర్ ప్రారంభించి ప్రసంగించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వయం ఉపాధి కోసం వారి వారి ఇంట్లోనే కుటీర పరిశ్రమల ద్వారా పలు రకాల వస్తువులను తయారీ చేసి స్వల్ప లాభాలతో విక్రస్తున్నట్లు పేర్కొన్నారు. బుధ, గురువారాల్లో కొనసాగే ఈ మెప్మా బజార్ ద్వారా దాదాపు రూ.2 లక్షల వ్యాపార లావాదేవీలు జరుగుతాయని జిల్లా ఐబీ స్పెషలిస్ట్ మోహన్‌కుమార్ తెలిపారు. మార్కెటింగ్ స్పెషలిస్ట్ మంగాదేవి మార్కెట్ టెక్నిక్‌లపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా కార్యాలయం ఉద్యోగి సీహెచ్ శ్రీనివాస్, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, 30 వార్డుల రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

అడవి పందిని వేటాడిన ఘటనపై విచారణ



అడవి పందిని వేటాడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ రేంజ్ అధికారి నాగసత్యనారాయణ

అల్లవరం: ఓడలరేవు సముద్ర తీరంలోని సరుగుడు తోటల్లో సంచరిస్తున్న అడవి పందిని సోమవారం రాత్రి వేటాడిన ఘటనపై జిల్లా ఫారెస్టు డిప్యూటీ రెంజ్ అధికారి బి.నాగసత్యనారాయణ బుధవారం విచారణ చేపట్టారు. ఓడలరేవు టెర్మినల్‌కు సమీపంలో అడవి పందిని బంధించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రెంజ్ అధికారి మాట్లాడుతూ 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం అడవి పందులను వేటాడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపడతామన్నారు. వన్య ప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వేటగాళ్ల నుంచి వన్యప్రాణులకు ప్రమాదం ఉందని గుర్తిస్తే వెంటనే అటవీ శాఖాధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్ వెంకటరమణ ఉన్నారు.